క్లుప్తంగా

యూనియన్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



వనపర్తి: రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్–327 రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన చీర్లయాదిసాగర్ ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల్లో ఆయనకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాన్‌గల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి వైపు నుంచి కొల్లాపూర్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తూ మండల కేంద్రంలోని పంచాయతీ భవనం సమీపంలో పంది అడ్డు రావడంతో వాహనంపై నుంచి కింది పడి గాయాలు అయ్యాయి. వెంటనే అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈయన వివరాలు తెలియాల్సి ఉందన్నారు. ఆచూకీ కోసం మండల పోలీసులను సంప్రదించాలన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



అమరచింత: మండలంలోని మస్తీపురంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. మండల ప్రధాన పశు వైద్యశాలకు అనుసంధానంగా ఉన్న సబ్ సెంటర్ కొన్నేళ్లుగా మరుగునపడింది. ఆస్పత్రి ఆలనా పాలనా చూసుకోవడానికి కాంపౌండర్ సైతం నియమించకపోవడం డిప్యూటేషన్‌పై పశుసిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడి సబ్ సెంటర్ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి ఆస్పత్రికి మరమ్మతు చేసి, పశు వైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

మక్తల్: రాష్ట్ర బీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించాలని బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బీసీలు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామకృష్ణ, తిరుమలేశ్, అశోక్‌గౌడ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: రెండు కార్లు ఢీ కొన్న ఘటనిది. స్థానికుల వివరాల ప్రకారం...హైదరాబాద్‌కు చెందిన రెండు వేర్వేరు కుటుంబాలు రెండు కార్లలో కర్నూల్ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నాయి. కాగా జానంపేట పాత పెట్రోల్ పంపు సమీపంలోని యూటర్న్ వద్ద ఒక వాహనం యూటర్న్ తీసుకునేందుకు రోడ్డుపై ఆగింది. దీంతో వెనుక ఉన్న కారుకు డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ఆ కారు వెనుక ఉన్న మరో కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రెండు కార్లు దెబ్బతిన్నాయి. ముందు కారులో వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది రెండు కార్లను ఘటనా స్థలం నుంచి ఠాణాకు తరలించారు. ఈ ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ విజయ భాస్కర్ తెలిపారు.

రూ.2వేల నోట్లు తీసుకోబోమని బోర్డులు

మక్తల్: ఇటీవల రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2వేల నోట్లు మార్చుకోవాలని సూచించింది. దీంతో మండలంలోని పలు దుకాణాల వద్ద రూ.2వేల నోట్లు తీసుకోమని బోర్డులు ఏర్పాటు చేశారు. ఆదివారం చాలామంది దుకాణాల వద్దకు తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయమై కొన్ని చోట్ల దుకాణాదారులతో పలువురు వాగ్వాదానికి దిగారు.

ధాన్యం అమ్మడానికి తప్పనితిప్పలు

మరికల్: మిలర్లు టార్గెట్ పూర్తి కావడంతో రైతులు తీసుకు వస్తున్న ధాన్యం కొనుగోలు చేయడానికి కొర్రీలు పెడుతున్నారు. దీంతో మండు టెండల్లో గంటల తరబడి ట్రాక్టర్ల తో పడిగాపులు కాసి వారిని బతిమాలి ధాన్యం అమ్మాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మరోపక్క తాలు, తేమ అంటూ బస్తాకు నాలుగు కిలోల వరకు తరుగు తీస్తున్నారని వాపోతున్నారు.

అకాలవర్షంతో అస్తవ్యస్తం



మదనాపురం సమీపంలో నేలకొరిగిన చెట్టు



మదనాపురం సమీపంలో గాలి దుమారం

మదనాపురం: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. కొత్తకోటకు వెళ్లే రహదారిపై చెట్లు నేలకొరిగిగాయి. రోడ్డుపై కొంత సమయం ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

ఖిల్లాఘనపురం: మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పల్లెలు అస్తవ్యస్తమయ్యాయి. సల్కెలాపురం, అప్పారెడ్డిపల్లి, పర్వతాపురం గ్రామాల్లో పెద్ద ఎత్తున ఈదురు గాలులు రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్లపై పెద్ద ఎత్తున చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు నిలిచాయి. వరి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని రైతులు రాసులుగా పోసి కవర్లతో కప్పి ఉంచారు.



పర్వతాపురంలో రోడ్డు పై విరిగిపడిన చెట్టు



అప్పారెడ్డిపల్లిలో ప్రధాన రోడ్డుపై కూలిన చెట్టు



పర్వతాపురంలో విరిగిన విద్యుత్ స్తంభం

ఎండాకాలంలో సైతం సాగునీరు

గోపాల్‌పేట: రైతులకు వర్షాకాలంలో వానలొస్తే కానీ కనిపించని సాగునీరు, ఎండాకాలంలో సైతం చెరువుల్లో నిల్వ ఉండేలా గడిచిన కాలంలో అభివృద్ధి చేసుకున్నామని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఏదుట్లలో ఇతర పార్టీలకు చెందిన వంద మందిని బీఆర్‌ఎస్‌లోకి కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామంలో ఇప్పటి వరకు మొత్తం 626 పింఛన్లు ఇచ్చామని చెప్పారు. ఎక్కడైనా పింఛన్లు రానివారు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వారికి అర్హతలు ఉంటే తప్పనిసరిగా ఇప్పిస్తానని చెప్పారు.



కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

గ్రామంలో చేపల మార్కెట్, యాదవులకు, ఉప్పర, కుమ్మరి వారికి కమ్యూనిటీ భవనాలు ఏర్పాటు చేసుకునేందుకు నిధులు మంజూరు చేశామని చెప్పారు.

వెలగని హైమాస్ట్ లైట్లు

- రూ.లక్షలు వెచ్చించి వృథా

ఖిల్లాఘనపురం: గిరిజన తండాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వ నిధులతో మండలంలోని 13 తండాల్లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు నిరుపయోగంగా మారాయి. తండాల్లో అవి ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. 10ఏళ్ల క్రితం రాజ్యసభ సభ్యుడు ఎంఏ ఖాన్ నిధులు రూ.15లక్షలు, హన్మంతరావు ఎంపీ నిధులు రూ.4.5లక్షలతో తిర్మలాయపల్లి రోడ్డుమీదితండా, రుక్కన్నపల్లి తండా, కర్నెతండా, కోతుల కుంటతండా, 13 తండాల్లో వీటిని ఏర్పాటు చేశారు. కేవలం ఆరు నెలల పాటు వెలిగిన లైట్లు ఆ తర్వాత బంద్ అయ్యాయి. చిన్నపాటి మరమ్మతు చేస్తే కొన్ని తండాల్లో లైట్లు వెలిగే అవకాశం ఉన్నప్పటికీ ఆయా పంచాయతీల సర్పంచ్‌లు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కనీసం వర్షాకాలం లోనైనా మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మండల కేంద్రంలో..

మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో చీకటిగా ఉందని ఆయా కాలనీల వాసులు కోరడంతో బస్టాండ్, కుర్వగేరి, బెస్తగేరి, తోకగేరి, తెలుగుగేరి, కుమ్మరిగేరి ప్రాంతాల్లో 2003లో రూ.6లక్షలతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. అవి ఐదేళ్ల పాటు వెలిగాయి. తర్వాత వచ్చిన సర్పంచ్‌లు పట్టించుకోకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. అధికారులు, సర్పంచ్‌లు స్పందించి హైమాస్టు లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఖిల్లాఘనపురం బెస్తగేరిలో నిరుపయోగంగా ఉన్న హైమాస్ట్ లైట్

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులను శాలువాతో సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

వనపర్తిటౌన్: ఏళ్ల కిందట పదో తరగతి చదువుకున్న స్నేహితులంతా ఒకచోట కలుసుకున్నారు. 2002– 03 బ్యాచ్‌కు చెందిన బలిజేపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన తెలుగు ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి మాట్లాడుతూ.. అన్ని బంధాల కంటే గురుశిష్యుల బంధం బలమైనదన్నారు. విద్యనందించిన గురువులను గుర్తుంచుకుని, సత్కరించి ఆశీస్సులు పొందాలని ఆలోచన విద్యార్థుల ఉన్నతికి నిదర్శనమని పేర్కొన్నారు. అదేవిధంగా అప్పటి గురువులు వెంకట్‌రెడ్డి, సుల్తాన్, మహానంది, సుధాకర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

పాత వస్తువులను అప్పగించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాతవస్తువులు, పాత దుస్తులు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ నాగరాజు, కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రభుత్వం ఆదేశాలమేరకు ఆర్‌ఆర్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాత సామాన్లు అప్పగించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

పరమేశ్వరుడి చెంత.. పచ్చదనం

- ఆకట్టుకుంటున్న వృక్షాలు
- దాతల సహకారంతో పదేళ్లక్రితం నాటిన మొక్కలు



పచ్చదనంతో కళకళలాడుతున్న చెట్లు



చెరువులో పరమేశ్వరస్వామి ఆలయం

ఆత్మకూర్: పరమేశ్వరస్వామి చెంత పచ్చదనం వెల్లువిరియడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల క్రితం దాతల సహకారంతో రూ.3లక్షలు వెచ్చించి నాటిన పండ్లు, పూల మొక్కలు ఇప్పుడు వృక్షాలుగా ఎదిగి రమణీయంగా, సవాసనలు వెదజల్లుతున్నాయి. పట్టణంలోని చెర్ల పరమేశ్వరస్వామి ఆలయం పరిసరాల్లో మొక్కలను నాటాలని భావించి భక్తబృందం వెంటనే కార్యాచరణ చేపట్టారు. దాతల నుంచి నిధులు సేకరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొక్కలను తెచ్చి నాటడంతోపాటు డ్రిప్ ఏర్పాటు చేసి సంరక్షించారు.

పండ్లు, పూల మొక్కలు

మామిడి, జామ, నేరేడు, దానిమ్మ, మేడిపండ్లు, సన్నజాజిమల్లెలు, బొడ్డుమల్లెలు, గులాబీ, మర్రి చెట్లు, టేకు చెట్లు, వేప, టెంకాయలు, జమ్మి, రాగి, చీమచింతచెట్లు, నల్లమద్ది, తెల్లమద్ది, మొదుగ, వెదురుబొంగులు, ఇతర మొక్కలను నాటారు. ప్రస్తుతం పూలను సేకరించి పట్టణంలో ఆలయాలకు పూజల నిమిత్తం ఇవ్వడంతోపాటు బయట విక్రయిస్తున్నారు.

మద్యం సేవించేందుకు అడ్డా..

రూ.లక్షలు ఖర్చుచేసి నాటిన మొక్కలు వృక్షాలుగా ఎదిగాయి. కొంతమంది మద్యం, పొగ తాగేందుకు అడ్డాగా మార్చుకుని చెట్లకు నష్టం చేకూరుస్తున్నారు. పోలీసులు తగుచర్యలు తీసుకోవాలని భక్తులు, స్థానికులు కోరుతున్నారు.



నేరేడు, దానిమ్మ, వేప చెట్లు

నిత్యం పూలతో పూజలు..



చెర్ల పరమేశ్వరస్వామివారికి నిత్యం ఇక్కడి పూలతో పూజలు చేస్తున్నాం. పట్టణంలోని మిగితా ఆలయాలకు పూల వ్యాపారి ద్వారా పూజలకు పంపిస్తున్నాం. ప్రస్తుతం అన్నిరకాల వృక్షాలతో గుడి పరిసరాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

– కర్నసయ్య, ఆలయ పూజారి, ఆత్మకూర్

అందరిపై బాధ్యత



చెరువు మధ్యలో వెలసిన పరమేశ్వరస్వామి ఆలయం ఎంతో చారిత్రాత్మకతను సంతరించుకుంది. అందరి కృషి ఫలితంగా పదేళ్ల క్రితం చందాల రూపంలో డబ్బులను సేకరించి అన్నిరకాల మొక్కలను నాటించాం. ప్రస్తుతం వృక్షాలుగా ఎదిగి ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయి. సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

– బంగారుభాస్కర్, వ్యాపారి, ఆత్మకూర్

దృష్టి సారిస్తున్నాం..



మున్సిపాలిటీలో ఇది వరకే పార్కులను ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షిస్తున్నాం, వృక్షాలుగా ఎదిగి పట్టణమంతా ఆహ్లాదకరమైన వాతావరణం సంతరించుకుంది. చెర్లపరమేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతివనాన్ని సంరక్షించేందుకు దృష్టి సారిస్తున్నాం. మద్యం తాగేందుకు రాకుండా పోలీస్‌శాఖ వారితో మాట్లాడుతాం.

– గాయత్రి, మున్సిపల్ చైర్‌పర్సన్

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



అమరచింతలో..



ఆత్మకూర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రోహిత్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.

ఆత్మకూర్: రాజీవ్‌గాంధీ నవభారత్ నిర్మాణకర్త అని దేశ అభివృద్ధికి ఎన్నో కొత్త విధానాలు అమలు పర్చారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు, పాలు పంపిణీ చేశారు.

మహనీయుడిని మరువలేం

గోపాల్‌పేట: ఐటీ రంగానికి పునాదులు వేసి దేశానికి దిశానిర్దేశం చేసిన రాజీవ్‌గాంధీని ఈ దేశం మరువలేదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



పెబ్బేరులో..

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. మండల అధ్యక్షుడు విజయవర్ధన్‌రెడ్డి, షకీల్, రాములు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: రాజీవ్ గాంధీ ఆశయ సాధనలో నేటి తరం యువకులు పయనించాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయ్యుబ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ విష్ణు అన్నారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళి అర్పించారు.

కాల్వల్లో పేరుకుపోయిన ముళ్లపొదలు



సింగపేట శివారులో ఎత్తిపోతల కాల్వ పరిస్థితి



అమరచింత శివారులో కాల్వ..

అమరచింత: అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న సాగునీటి కాల్వల్లో ముళ్లపొదలు పేరుకుపోయి, సాగునీరు ముందుకు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎత్తిపోతల పథకంలో భాగంగా మూలమళ్ల, మస్తీపురం, సింగపేట, ఖానాపురం, అమరచింత, పాంరెడ్డిపల్లెలో ఆయకట్టుకు కాల్వల ద్వారా సాగునీరు అందుతుంది. ప్రతి ఏడాది ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వల్లో పెరిగిన ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేశారని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్లుగా పూడిక తీత పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా లిఫ్ట్ ప్రారంభం కాకముందే ఉపాధి హామీ ద్వారా కాల్వలలో పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం



సంతలో కనిపించని జనం

- వడగాలులకు పలువురికి అస్వస్థత
- వెలవెల బోయిన వారాంతపు సంత

ఆత్మకూర్: మండుతున్న ఎండలు, వడగాలులతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వడదెబ్బ తగిలి పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ ఎండకు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 6గంటల తర్వాతనే జనం ఇళ్లలోనుంచి బయటకు వస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు తీవ్రస్థాయిలో ఉండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చల్లదనం కోసం కూల్‌డ్రింకులు, జ్యూస్, కొబ్బరి నీళ్లు, చెరుకురసం, పండ్లరసాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవసరముంటే తప్పా బయటకు రాకూడదని, అత్యవసర పరిస్థితిల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలని, తలకుటోపీ ధరించాలని, ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు శబరి, నిస్సార్ అహ్మద్ సూచించారు.

పలువురికి అస్వస్థత

అధిక ఎండల కారణంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 9మంది వడదెబ్బకు గురై పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం పదుల సంఖ్యలో వడదెబ్బ బాధితులు చికిత్స పొందుతున్నారు.



ఎండలో ప్రయాణికుల తిప్పలు

సంతకు సన్ ఎఫెక్ట్..

ఆదివారం పట్టణంలో నిర్వహించే సంతకు సుదూర ప్రాంతాల నుంచి జనం అధిక సంఖ్యలో వస్తుంటారు. ఎండలు అధికంగా ఉండడంతో జనం రాక గిరాకీ లేక కూరగాయల వ్యాపారులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.



ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వడదెబ్బ బాధితులు



నిర్మానుష్యంగా మారిన గాంధీచౌక్

‘పాలమూరు-రంగారెడ్డి’ని నీరుగార్చారు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును బీఆర్‌ఎస్ ప్రభుత్వం నీరుగార్చిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రాజెక్టుపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేసిన అవగాహన లేని వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిసున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.38వేల కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారని, కానీ రీడిజైన్ పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా ప్రజలకు తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. 2015లో భూమిపూజ చేసినప్పుడు మూడేళ్లలో పూర్తిచేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి విస్మరించారని అన్నారు. ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు కేసులు వేసి జాప్యానికి కారణమవుతున్నారని లక్ష్మారెడ్డి చేసిన వ్యాఖ్యలు సరికావని, సదరు నాయకులు బీఆర్‌ఎస్‌లో ఉన్న సంగతి మరిచిపోవద్దని అన్నారు.

మంత్రులు, ఎమ్మెల్యేల అసమర్థత వల్లే..

బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అసమర్థత వల్లే ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యమవుతోందని టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ప్రాజెక్టు కోసం కొనుగోలు చేస్తున్న మోటార్లు, పైపులకు అధిక ధరలు వేస్తుండడం వల్ల జరుగుతున్న అవినీతి గురించి నాగం జనార్దన్‌రెడ్డి కేసు వేశారని, ప్రాజెక్టు ఆపాలని కాదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. సంజీవ్, లక్ష్మణ్‌యాదవ్, సిరాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.